కథా నిలయం
3881
శ్రీకాకుళం

# మనసుకీ మనిషికీ మధ్య

"కృష్ణా! బజార్నించి జీడిపప్పు తెచ్చిపెట్టాలిరా."

"రంగన్నచేత తెప్పించుకోకూడదా, అమ్మా?" వెంటనే వచ్చింది ప్రశ్నలాంటి జవాబు.

"వాడుంటే నీ కెందుకు చెపుతానురా?"

"అయితే, వాసు చేతో రమణచేతో తెప్పించుకో కూడదా! తీరిగ్గా రోజంతా కూర్చునేవాళ్ళు....వాళ్ళకు చెప్పక నాకు చెపుతావేమిటి? నేను సినిమాకి వెళుతున్నాను. ఫ్రెండు ఎదురుచూస్తుం ...." మాట పూర్తి కాకుండానేబయటికి వెళ్ళిపోయాడు కృష్ణ.

"ఎవరా ఫ్రెండు? ఆడా? మగా?" హైమవతి మనసులో మెదిలిందా ప్రశ్న.

"ఎదురు చూస్తుంటుంది" అని నిజం చెప్పలేక, 'ఎదురు చూస్తుంటాడు' అని అబద్ధం చెప్పలేక మాట మింగేసి వెళ్ళిపోతున్న కొడుకు వంక చూసి చిన్నగా నిట్టూర్చి హాల్లోకి వచ్చింది. టెన్నిస్ రాకెట్ తిప్పుకుంటూ, విజిల్ వేసుకుంటూ మెట్లు దిగుతున్నాడు రెండో కొడుకు వాసు.

"ఒరే, వాసూ! ఒక చిన్నపని చేసిపెట్టాలిరా! అర్జెంటుగా అర కిలో జీడిపప్పు తెచ్చిపెట్టాలిరా!"

"ఏమిటమ్మా నాకు చెపుతావు! నే నెప్పుడన్నా బజారు పని చేశానా? ఆ రంగన్నచేత తెప్పించుకో!"

"వాడుంటే నీదాకా ఎందుకొస్తాను?" లోలోపలే అనుకుని పైకి మాత్రం—"వాడికి జ్వరమనీ, ఈ రోజు పనిలోకిరాడనీ, రేపటినించీ వస్తాడనీ నిన్నరాత్రి నేను ఊర్నించి రాగానే నువ్వే కదరా నాకు చెప్పావు! మరిచిపోయావా? ఈ రోజు వాడు రాలేదుగా?"

"అవును, మరిచిపోయాను. అయితేమాత్రం....నాకు ఉద్యోగం లేదుకదా అని వాడికి చెప్పేపని నాకు చెపుతున్నావా? అన్నయ్య ఉద్యోగం చేస్తున్నాడు కదా అని వాడంటేనే నీ కిష్టం. అందుకే వాడికి చెప్పకుండా నాకు చెపుతున్నావు బజారుపని. అంత పక్షపాతబుద్ధి పనికి రాదమ్మా!" టెన్నిస్ రాకెట్ ఊపుకుంటూ వెళ్ళిపోయాడు వాసు. వాసు మాటలు ఈటెల్లా తగిలి కొంచెంసేపటికి కానీ తేరుకోలేక పోయింది హైమవతి. ఆ మాటలే చెవుల్లో మరి మరి వినుపిస్తుండగా, పంటి బిగువున బాధ దిగమింగుతూ రమణ గదిలోకి దారి తీసింది. కుంచె చేతిలో పట్టుకుని ఏదో ఆలోచిస్తూ కిటికీదగ్గర నిలబడి ఉన్నాడు రమణ. తల్లిని చూస్తూనే యిబ్బందిగా మొహం పెట్టాడు. "నన్ను డిస్టర్బ్ చెయ్యడానికి వచ్చినట్టున్నావు. ఇప్పుడు నే నెవరితోనూ మాట్లాడను. అదిగో, ఈ కిటికీలోంచి బయటికిచూడు—ఎంత మంచి సీనరీ కనపడు తోందో, ఆ ప్రకృతి సౌందర్యాన్ని కాగితం మీద పెడదా మను కుంటున్నాను."

అప్రయత్నంగా గొణిగింది హైమవతి:— "రోజూ చేస్తున్న పనే అదిగా?"

"ఆ....ఆఁ, అలా అనకు మరి. రోజూ ఒకేబొమ్మ వేస్తున్నా ననుకుంటున్నావా? రకరకాల బొమ్మలు పైంట్ చేస్తోంటే...."

"సరే కానీ....అర్జెంటుగా బజారు పని ఒకటి చేసిపెట్టాలి."

"ఏమిటమ్మా నువ్వు మరీనూ! నా మూడ్స్ చెడగొట్టాలని చూస్తున్నావు. ఇప్పుడు నేనా ప్రకృతి అందాన్ని వేస్తేగానీ ఎవరి మాటా వినేదిలేదు."

'బాగా! ఒకప్పుడు విన్నావు గనకనా!' హైమవతి మనసు బాధగా మూలిగింది.

"సైకిలుంది కదరా? సైకిలుమీద వెళ్లొస్తే ఎంత సేపు? అర కిలో జీడిపప్పు తెచ్చిపెట్టు."

"వెధవది జీడిపప్పులూ, పెసరపప్పులూ కోసం చిత్రకళని వెనక్కి పెట్టమంటావా? ఇంతకన్నా అవమానం ఇంకోటి వుంటుందా?"

'అవును చేసిపెడితే ప్లేట్లో నలుసంతకూడా మిగల్చకుండా తిని మళ్ళీ మళ్ళీ మారుకూడా వేయించుకుంటావు." లోలోపలే అనుకుంటూ, ఇంక వాడితో మాట్లాడి లాభంలేదని ఇవతలి కొచ్చేసింది.

జీడిపప్పు పాకం ఆయన కెంతో ఇష్టం. ఏ స్వీటయినా సరే ఆ స్వీటు తరవాతే ఆయనకి. ప్రతి ఏడూ తన పెళ్ళిరోజుకి తప్పకుండా ఆ స్వీటు చేసి తీరుతుంది. ఆయన కిష్టమైన స్వీటుచేసి, అది ఆయన తింటే తనకెంతో తృప్తిగా వుంటుంది. బంధువుల యింట్లో పెళ్ళికి వెళ్ళి నిన్న రాత్రే తిరిగివచ్చింది తను. 'దగ్గర బంధువులు. ఎవరూ మన ఇంట్లోంచి వెళ్ళకపోతే వాళ్ళకి కోపం వస్తుంది. నేను రాలేను. నువ్వెళ్లు. నాకు పనుంది.' అంటూ బలవంతంగా తనని పంపించారాయన. లేకపోతే రెండు, మూడు రోజుల ముందే తెప్పించి వుంచుకునేది రంగన్నచేత. రేపు పొద్దున్న పనిలోకొస్తాడు రంగన్న. అప్పుడే వాడిచేత తెప్పించుకుందామంటే రేపాదివారం. కొన్ని దుకాణాలు ఉంటాయి; కొన్ని ఉండవు. మంచి పప్పు రేపు దొరక్కపోతే రుచి బాగుండదు. చేసింది వృథా అవుతుంది. ముగ్గురు పిల్లలు వున్నారు. ముగ్గురూ మగపిల్లలే. ఏం లాభం? ఒక్కడూ ఏనాడూ అత్యవసరానికి కూడా బజారుపని చేసిపెట్టడు. ఆయన మాత్రం.... ఇంటి

యజమాని అన్నమాటే కానీ, ఇంటివిషయా లేనాడైనా ఒక్కసారైనా పట్టించుకున్నారా? ఆఫీసు, క్లబ్బు....ఇదే జీవితం. రోజూ ఆఫీసు నించి అటునించటే క్లబ్బుకిపోతే మళ్ళీ ఇంటికిరావడం తొమ్మిదిదాటాకే. ఇంక పిల్లలదారి పిల్లలదే. పెద్దవాడు కృష్ణ ఎం. ఏ. పాసయాడు. ఎలాగైతేనేం, లంచాలు పోస్తేనేం ఉన్న ఊళ్ళోనే ఉద్యోగం దొరికింది వాడికి. రెండోవాడికి బి. ఎ. పూర్తయిం దనిపించుకోడానికి మూడు చెరువుల నీళ్ళు తాగినంత పనయింది. మూడుసార్లు కట్టి ముప్పతిప్పలూ పడి ఎలాగో అలా అది పూర్తిచేశాడు. ఉద్యోగం దొరకలేదు దొరక లేదు అనేకంటే చెయ్యడంలేదు అనడం సబబుగా ఉంటుంది. అవకాశం వచ్చినా కూడా — 'టట్! ఇదేం ఉద్యోగం? ఇటువంటి ఉద్యోగం? నేను చెయ్యను' అంటూ తేలికగా తీసి పడెయ్యడం అలవాటుచేసుకుని, ఊరికే స్నేహితులతో తిరుగుతూ, డబ్బెన్ని విధా లుగా ఖర్చుపెట్టవచ్చునో నేర్చుకుంటున్నాడు. ఇంక మూడోవాడు రమణ....అటు బి. ఎ. పూర్తవలేదు; ఇటు చిత్రకళలోనూ చెయ్యి తిరగ లేదు. మధ్యస్థంగా వేలాడుతున్నాడు. ఎవరిమాట వినిపించుకోడు. ఏవో పిచ్చిగీతలు గీస్తూ తన కున్నంత ప్రావీణ్యం చిత్రకళలో మరెవరికీ లేదన్నట్టుగా పోజు పెడతాడు. తండ్రిచేసిన గారాబం ఎంతకి తెచ్చిం దంటె, ఇప్పుడు వాడికి తండ్రన్నా లెక్కలేదు. ఇంట్లో ఉన్నంత సేపూ తన గదీ, తన గీతలూ—ఇవే లోకంగా వుంటాడు. భర్తా, ముగ్గురు పిల్లలూ ఉండికూడా తనది ఏకాంత జీవితమే, తన భయాలూ, బాధలూ, ఆందోళనలూ పట్టించుకునేవాళ్ళే లేరు. తనకీ ఇంట్లో. పిల్లల భవిష్యత్తు గురించి బెంగ. వ్యసనలోలు డౌతున్న భర్త ఆరోగ్యం గురించి బెంగ, భయం. డబ్బున్నా మనసుకు సుఖం, శాంతిలేని ప్రాణం తనది కానీ.... కాని, ఇరుగు పొరుగువాళ్ళ దృష్టిలో తనెంతో అదృష్టవంతురాలు. రెండు చేతులా ఆర్జిస్తున్న భర్త. కట్నాలు తను పోసి కష్టపడి పెళ్ళిళ్ళు చెయ్యక్కరలేదు. వేలకి వేలు కట్నాలు తమ యింటికి తీసుకొచ్చే పిల్లలే ముగ్గురూను. ఇవే తనని శిఖరంమీదికి తీసుకుపోయి కూర్చో

పెడుతున్నాయి ఇరుగు పొరుగుల దృష్టిలో. కానీ, పొద్దున్న ఆఫీసుకి వెళ్ళిపోతే మళ్ళీ రాత్రి క్లబ్బునించి ఇంటికి వచ్చేదాకా, యింట్లో అడుగు పెట్టేవరకూ తనకి భార్యా, పిల్లలున్నారనే సంగతే గుర్తురాదు. తన భర్త శ్రీనివాసరావుగారికి, ఆ మాటంటే మాత్రం ఇంతెత్తున లేస్తారు. అందుకే ఇన్నేళ్ళుగా ఆయన ప్రవర్తన భరిస్తున్నా, ఆమాట అనడానికి మాత్రం ధైర్యం చాలదు తనకి. అసలింతకీ రేపు తమ పెళ్ళయిన రోజని గుర్తే లేనట్టుందాయనకి. హుఁ. ఈ ఒక్కసారే కాదుగా? ప్రతియేడూ తమ పెళ్ళయినరోజు తనే గుర్తుచెయ్యాలి తప్ప ఆయనకి మాత్రం గుర్తురాదు. పెళ్ళివారి యింట్లో బంధువులంతా ఇంకో రెండు రోజులుండి వెళ్ళమని ఎంత బలవంతం చేసినా వుండక, ఉరుకులు, పరుగులమీద తను వచ్చేసింది. ఒకరోజు ముందైనా వెళ్ళి యింట్లో సరుకులు ఏమున్నాయో, ఏవి లేవో చూసుకోవాలి. ఎల్లుండేకదా తమ పెళ్ళయినరోజని బయలుదేరి నిన్న వచ్చేసింది. పుత్రరత్నాలు ముగ్గురు వున్నారు. ఏం లాభం? ఒక్కడూ మాట వినిపించుకోడు. బజారు పని చేస్తే నామోషీ! నీరసంగా సోఫాలో కూలబడింది హైమవతి, ఆలోచనల బరువుతో. మరో అయిదు నిమిషాల్లో—"అమ్మా! ఇప్పుడే అలా ఓ సారి బయటకెళ్ళొస్తాను. వచ్చేస్తాను పది నిమిషాల్లో" అంటూనే తల్లి చెప్పేది విన్నా చూడకుండా, 'ఎలాగూ బయటికి వెళుతున్నావుగా, వచ్చేటప్పుడు జీడిపప్పు తీసుకువస్తావా?' అని ఎక్కడ అడుగుతుందోనని పరుగులాంటి నడకతో బయటికి వెళ్ళిపోయాడు రమణ.

ఆలోచనల్లో, తెలియకుండానే టైము గడిచిపోయింది. చూస్తూండగానే చీకటి పడిపోయింది.

చటుక్కున లేచింది హైమవతి. 'ఇలా కూర్చుంటే కాదు. బయట ఎవరైనా తెలిసిన పిల్లలు కనపడితే వాళ్ళచేతనైనా తెప్పించుకోవడం మంచిది. రేపటికి కూడా జ్వరం తగ్గక, ఒకవేళ రంగన్న రేపు కూడా పనిలోకి రాకపోతే?' వీధిలోకి వచ్చి నిలబడి అటూ, ఇటూ చూసింది. దూరంగా ఎవరో కుర్రాడు వస్తూ కనిపించాడు. చేతో ఇనప

చక్రాన్ని దొర్లించుకుంటూ వస్తున్న ఆ నల్లటి కుర్రాడు దగ్గరగా వచ్చాడు.

"నీ...పేరేమిట్రా ?"

తల దించుకునే పోతున్న ఆ కుర్రాడు చక్రాన్ని దొర్లిపోకుండా ఆపి, చేత్తో పట్టుకుని తల ఎత్తాడు.

ఆ కుర్రాడి నిదివరకు చూసినట్టే అనిపించింది హైమవతికి. పనిమనిషి కొడుకుతో కలిసి వాడుకూడా ఆడుతుండగా ఒకటి, రెండు సార్లు చూసిన గుర్తుంది.

కానీ వాడికే అర్థంకాలేదు. ముక్కూ మొహం తెలియని తనని పట్టుకుని పేరడుగుతూం డెందు కీవిడ ? అన్నట్టుగా ఉన్నాయి వాడి చూపులు. "నా పేరు రావులండీ."

"రావులూ, దుకాణానికెళ్ళి అరకిలో జీడిపప్పు తెచ్చిపెడతావా ?"

తెచ్చిపెడతా నన్నట్టుగా చిన్నగా తలవూపాడు వాడు.

లోపలికెళ్ళి డబ్బు తీసుకొచ్చి ఇచ్చింది. "మంచిది చూసి తీసుకురా. త్వరగా వచ్చేస్తావుగా."

రావులు మలుపు తిరిగాక లోపలికొచ్చింది.

"రేపు ఆదివారం కావడం....గుడిలోమెల్ల .... అదృష్టమే అనుకోవాలి. రోజూ పగలు భోజనం ఆఫీసుకే పంపాలి క్యారియర్, మధ్యాహ్నం ఇంటికిరారుకనక. రాత్రిభోజనం తొమ్మిది దాటాకక్లబ్‌నుంచి ఇంటికి వచ్చాక. పెద్దవాడికి పొద్దుపోయి భోజనమే అలవాటు. తండ్రితో కలిసి తింటాడు. వాళ్ళిద్దరికీ పెట్టాకే తను తినేది. ఇంక ఆదివారాలు కూడా ఆయన ఫ్రెండ్సుతో, కాలక్షేపాలతో బిజీగానే ఉంటారు. పొద్దున్న ఎనిమిదికి లేచి కాఫీ, టిఫినూ తీసుకుని, స్నానంచేసి ఫ్రెండ్సుతో బయటికెళ్ళిపోతే ఒంటిగంటకు కానీ రారు ఇంటికి. కృష్ణకూడా

తండ్రితో కలిసి సెలవురోజులో ఒంటిగంటకే వస్తాడు భోజనానికి. తను ఆయనతో కలిసి భోజనంచేసి యెన్నేళ్ళయిందో! ఒంటిగంటకి భోజనం కానిచ్చి పడుకుంటే ఇంక ఆ నిద్ర నిద్రా నాలుగుగంటలకే లేవడం. లేచి లేవగానే కాఫీ, టిఫిను కానిచ్చి ఎవరో తరుముకొస్తున్నట్టే క్లబ్బుకి పరిగెడతారు, మళ్ళీ పునర్దర్శనం తొమ్మిది దాటాకే. ఇంక ఆ దిన చర్యలో మార్పు ఉండదు కాని, రేపొక్కరోజైనా తనకోసం ఆ దిన చర్యలో మార్చుకోమని అడగాలి. రేపొక్కరోజూ బయటికెక్కడికీ వెళ్ళకుండా తనతో గడపమని అడగాలి. అబ్బాయిలు ముగ్గురికీ వడ్డించేసి వాళ్ళ భోజనాలయ్యాకే తామిద్దరూ కూర్చుని కబుర్లు చెప్పుకుంటూ తినాలి. ఈ చిన్న కోరిక తీరుతుందో, లేదో? భోజనంలోకూడా అన్నీ ఆయన ఇష్టమైనవే చెయ్యాలి కూరలు. చేసినా, చెయ్యకపోయినా ఆయన కిదేమీ పట్టదు. ఆఫీసు, ఫ్రెండ్సు, క్లబ్బు, బాటిల్స్—ఇదే లోకంగా ఉన్న మనిషికి ఇటువంటి విషయాలు పనికిరావు కాబోలు. అసలు ప్రతిఏడూ కూడా తను గుర్తు చెయ్యవలసిందేగా తమ పెళ్ళయినరోజు? కానీ....కానీ, ఎంతైనా తను ఆడది. తనకి జీవితంలో ఇదే పెద్ద పండగ. తనెలా మరిచి పోగలదు? అదే! ఆలోచనల్లో టైమే తెలియలేదు. ఇంకా రావుట్లు రానేలేదే? వస్తూనే ఉండి ఉంటాడు ఈ పాటికి. పాపం! చిన్న కుర్రాడు దూరం కదా బజారు! మెల్లిగా నడుస్తూ రావాలి కదా! ఇప్పుడే వస్తానని బయటకెళ్ళిన రమణ కూడా రాలేదే?' కాలు కాలిన పిల్లిలా అటూ, ఇటూ తిరుగుతున్న హైమవతికి ఉన్నట్టుండి గుండెలో కలుక్కు మన్నట్టయ్యింది. సన్నసన్నగా గుండెలో నెప్పి మొదలైంది. నిలబడలేక సోఫాలో వెనక్కి వాలింది.

'ఏమిటిది? ఎప్పుడూ ఇలాంటి నెప్పి రాలేదే? అబ్బా! అంత కంతకీ నెప్పి ఎక్కువవుతూంది. గుండె ఆగిపోదు కదా? భగవాన్! రేపొక్క రోజు బ్రతకనీ! ఆ తరవాత నీ ఇష్టం. మృదువుగా చేత్తో గుండెమీద రాసుకుంటూ భగవంతుడిని తలుచుకొంది. పావుగంట గడిచింది. నెప్పి ఉధృతం ఎక్కువ అవుతూందే తప్ప తగ్గే సూచనలు కనపడలేదు. భయం రెట్టింపయింది.

'భర్తా, పిల్లలూ ఉండికూడా ఎవరూ లేనిదానిలాగా ఇలా ఒంటరిగా ఉండగానే ప్రాణం హరీ మనదు కదా?' పంటి బిగువున నెప్పి భరిస్తూ...లేచి గోడ పట్టుకుని నెమ్మదిగా అడుగులువేస్తూ వీధి గుమ్మంలోకి వచ్చింది. పక్కింటి వాళ్ళబ్బాయి గోపీ దేవుడిలా కనిపించాడు. చేతిలో పుస్తకాలున్నాయి. "బాబూ! గోపీ!" గేటు దగ్గరగా వచ్చి ఏమిటన్నట్టుగా చూశాడు గోపీ.

"మామయ్యగారు క్లబ్బులో ఉంటారు. అర్జెంటుగా ఇంటికి రమ్మన్నానని చెప్పగలవా బాబూ?''

"చెపుతానండీ! నేను ట్యూషన్‌కి వెళ్ళుతున్నాను. మామయ్యగారితో చెప్పేసి అటునుంచి ట్యూషన్‌కి వెళ్ళిపోతానండి."

"అలా చెయ్యి, బాబూ! తప్పకుండా చెప్పు. మరిచిపోకు.''

లోపలికి వచ్చి, మళ్ళీ సోఫాలో వాలింది. నెప్పి భరించలేనిదిగా అయింది. అరగంట గడిచింది. శ్రీవారొస్తున్న జాడలేదు సరికదా, పిల్లలు వస్తున్న జాడకూడా లేదు. చెప్పా పెట్టకుండా సినిమా కెళ్ళి రావడం పిల్లలు ముగ్గురికీ మామూలే. ఈ వేళ ఏ కళ నున్నాడో పెద్దవాడు సినిమాకి వెళుతున్నానని చెప్పాడు. తక్కిన ఇద్దరూకూడా ఏ సినిమాకో వెళ్ళి ఉంటారు. స్నేహితులు బలవంతం చేసి సినిమాకి లాక్కుపోయారని ఇంటికొచ్చాక చెప్పడం వాళ్ళకి మామూలే. వినడం తనకి మామూలే. ఈమధ్య కృష్ణ ఒక పంజాబీ అమ్మాయితో కలిసి తిరుగుతున్నట్టు చూచాయగా తెలిసింది తనకి. ఎంత కొడుకైనా ఇటువంటి, విషయాలెత్తితే నెమ్మదిగా సమాధానం చెప్పే రకంకాదు వాడు. కోపంలో ముగ్గురికీ ఆ తండ్రి పోలికే వచ్చింది. పోనీ, ఆయనతో చెప్పి ఈ సంగతి నిజమో, అబద్ధమో వాకబు చెయ్యండి అందామంటే, కంచే చేను మేస్తుంటే ఇంకేమిటి చేసేది? భర్తకి విడాకులిచ్చి, గుంటూరు నుంచి ఈ ఊరొచ్చి ఇక్కడ కాలేజీలో లెక్చరరుగాచేరి, క్లబ్బులోకూడా ఈ మధ్యనే మెంబరైన శ్యామలతో ఆయనకి పరిచయం బాగా పెరిగిందనీ. అది ఏ రూపం

దాలుస్తుందోనని వింతగా వాళ్ళూ వీళ్ళూ చెప్పుకోవటం తన చెవులకూడా పడింది. ఇన్నేళ్ళొచ్చి ఇవేం బుద్ధులని నిలదీసి ఆయన్ని అడగాలనే అని పిస్తుంది. కానీ, అందుకు తగ్గ ధైర్యమే లేదు. పైగా అదిగో పులంటే ఇదిగో తోక అనే లోకం ఇది. దాని మాటలు నమ్మి అందులో నిజ మెంతో తెలియకుండానే, లేనిపోని అనుమానాలతో ఆయన్ని ప్రశ్నించి, పసిగిస్తే: ఆయనకంటే ముందు తనమనసు బాధ పడుతుంది—కట్టుకున్న భర్తనే అనుమానించానే అన్న చింతతో, అందుకే వాళ్ళమాటలూ వీళ్ళ మాటలూ లక్ష్య పెట్టక ఆయనమీద నమ్మకంతో ఉండగలుగుతూంది. అబ్బ! నెప్పి? అంతకంతకీ ఎక్కువై ప్రాణం తీస్తూంది. కడసారిగా ఆయన్ని, పిల్లల్ని ఒకమారు చూడకముందే ఈ గుండె ఆగిపోదు కదా? అయినా, రేపుని గురించి ఎంతో తీయగా ఊహ లల్లుకుంటున్న ఈ సమ యంలో రావాలా ఈ నెప్పి?

* * *

దుకాణం ముందు అయిదారుగురు ఉన్నారు. మధ్యలో నిలబడి వున్నాడు రావులు. వాడి కళ్ళు ఎదురుగా సీసాల్లో ఉన్న చాక్లెట్ల మీ దున్నాయి అవి చూస్తుంటే వాడి నోరూరుతూంది. చాకలెట్ ఎప్పుడూ తినలేదు. తనతో ఆడుకునే సుబ్బిగాడు చెప్పా డొకసారి – ఎంతో బాగుంటుంది. తియ్యగా ఉంటుందని. ఒక్కటంటే ఒక్క చాకలెట్ తన కెవరన్నా పెడితే ఎంత బాగుండును!

కొట్టువాడు నర్సిమ్ములి కళ్ళు రావులి గుప్పిట్లో నలుగుతున్న నోటు మీద పడ్డాయి. వాడి చూపులూ, వాడు నిలపడ్డ తీరూ అనుమానాన్ని మరింత బలపరిచాయి. "ఏరా రావులూ! ఏటి కత? ఎక్కడ దొబ్బు కొచ్చినావా నోటు?" అంటూనే లేచి, కోపంగా రావులికి దగ్గరగా వచ్చి విసురుగా రావులి చేతిని లాగాడు. ఆ విసురుకి రావులి చెయ్యి నొప్పె

ట్టింది. అనుకోని ఆ సంఘటనకి వాడు తెల్లబోయాడు. రావుఁలు చూసే బెదురుచూపులతో నర్సిమ్ములి అనుమానం తిరుగులేనంతగా దృఢ పడింది.

"నేనెక్కడా దొబ్బుకు రాలేదు.... ఒకమ్మగారిచ్చారు." రావుఁలి జవాబు పూర్తవకుండానే పగలబడి నవ్వాడు నర్సిమ్ములు.

"ఓహోహో! నీమీద జాలితో అయిదు పైసలు, పది పైసలూ కాక ఏకంగా పది రూపాయలిచ్చారా? ఎవర్రా ఆ అమ్మగారు?" రావుఁలు తల్లీ, తండ్రీ లేని అనాథ అని నర్సిమ్ములికి తెలుసు. జాలిపడ్డ తల్లులు అయిదు పైసలూ, పది పైసలూ ఇస్తూండడం కూడా తెలుసు.

రావుఁలు కళ్ళు మళ్ళీ చాకలెట్ల సీసా మీదికే వెళ్ళాయి. వాటిని తినక్కర్లేకుండా కళ్ళతో చూసుకుని కడుపు నింపుకుంటూన్నాడు.

"ఏరా! నిజం చెప్పు, ఎక్కడ దొబ్బుకొచ్చావో! లేకపోతే తన్నులు తగులుతాయి."

"నేను దొంగతనం సెయ్యలేదు .... ఒకమ్మగారేమో .... మరేమో....చాకలెట్లు కాదు....కాదు....అరకిలో జీడిపప్పు తెచ్చిపెట్ట మన్నారు" చాకలెట్ల సీసామీంచి బలవంతంగా చూపు మరల్చుకున్నాడు. వెనక్కి తిరిగి అక్కడున్న పెద్దమనుషులతో అన్నాడు నర్సిమ్ములు: "చూశారా, సార్ ఎలా మాట మారుస్తున్నాడో! నేనిందాకణ్ణించి గమని స్తూనే ఉన్నాను—వాడినీ, వాడి దొంగ చూపుల్నీ. ఆ పది నోటెక్కడో కొట్టుకొచ్చినట్టే, ఈ సామాన్లలోంచి ఏదో ఒకటి దొబ్బుకు పోదామని దొంగ కాకిలా అటూ, ఇటూ చూస్తున్నాడు. నేను గమనించబట్టి సరి పోయింది. లేకపోతే ఏదో ఓటి జేబులో ఏసుకు పారిపోను. ఏరా! ఎన్నాళ్ళ బట్టిరా ఈ దొంగతనాలు?" రావుఁల్ని వంగదీసి బాదాడు నర్సి మ్ములు. రావుఁలికి ఏడుపాగలేదు. రెండు చేతులూ జోడించి ఏడుస్తూ అన్నాడు: "నే దొంగతనం సెయ్యలేదు. ఆ అమ్మగారు...."

"ఏ అమ్మగారు? పేరేంటి?" అడిగాడు నర్సిమ్ములు.

"తెలవదు."

"పోనీ, అయ్యగారి పేరు సెప్పు."

"తెలవదు."

"ముక్కూ మొహం తెలియని నిన్ను నమ్మి ఇంత డబ్బిచ్చారంటే నమ్మాలన్నా మేము?"

నర్సిమ్ములి దెబ్బలకి రావుఁలి ఒళ్ళు కందిపోయింది. వాడి ఏడుపుకీ, అరుపులకీ ఎవరి మనసూ కరగలేదు.

"వేలిడేసి వెధవలుకూడా దొంగతనాలు మరిగారు. ఇంకో నాలుగు తగలనివ్వండి గాడిదకి...." దారే పోయేవాళ్ళ కామెంట్లు.

"నాతో రండి. ఆ అమ్మగారెవరో, ఆ ఇల్లెక్కడో చూపిస్తాను. తీసిప్పా తెమ్మని ఆ యమ్మగారే ఈడబ్బు నాకిచ్చారో, లేదో స్వయంగా మీరే కనుక్కోండి" అన్నాడు రావుఁలు, దెబ్బలుతిని అలిసిపోయి, నర్సిమ్ములు కాళ్ళు పట్టుకుని.

"అమ్మగార్ని చూపిస్తానవగానే నువు చెప్పేదంతా నిజమేనని నమ్మేస్తాననుకున్నావట్రా? నిన్నింత తేలిగ్గా వదిలిపెట్టను. సరే కూర్చో. కొట్టు కట్టేసినంక నీతో వస్తాను." కళ్ళు తుడుచుకుంటూ అక్కడే చతికిలపడ్డాడు రావుఁలు.

కొట్టు కట్టేసరికి పొద్దు పోయింది బాగా. అప్పుడు రావుఁలుతో కూడా నడక సాగించాడు నర్సిమ్ములు. ఇంటికి దగ్గర్లో రాగానే—"అదిగో అదే యిల్లు. అమ్మగార్ని మీరే అడగండి. నా మాట అసత్యమేమో...." అన్నాడు రావుఁలు. అప్పుడింక రావుఁలి మాట నమ్మక తప్పలేదు నర్సిమ్ములికి. వెనక్కి తగ్గాడు. "నే వెళుతున్నానంటూ" తిరిగి చూడకుండా ఇంటిముఖం పట్టాడు. గేటుదగ్గర తారట్లాడుతున్న రావుఁల్ని రమణ చూశాడు.

"ఎవరు నువ్వు ? ఏం కావాలి ?"

వణుకుతున్న చేత్తో పదిరూపాయల నోటు అందించాడు రాముఁలు. "ఇదమ్మగారి కియ్యండి. జీడిపప్పు తెమ్మని నాకిచ్చినారు. తీసుకురాలేదని సెప్పండి."

"సరే, పో."

చింకి చొక్కాతో మొహం తుడుచుకుంటూ, కాళ్ళీడ్చుకుంటూ వెళ్ళిపోయాడు రాముఁలు,

రమణ కళ్ళలో వెలుగు వచ్చింది. "ఓ పది రూపాయలు కావాలని నిన్న అమ్మ నడిగితే—"రోజూ పదులూ, పదిహేమ్లూ కావాలంటే ఎక్కడినించొస్తాయిరా" అని విసుక్కుంది. ఇవ్వనేలేదు నిన్న. ఇప్పుడీ పదీ గుట్టుచప్పుడు కాకుండా తను జేబులో వేసుకుంటే ఎవరేం చెయ్యగలరు ?"

*        *        *

"రోజూ నాలుగున్నరకే లేచే తనకి ఇంత వెలుగొచ్చేదాకా మెలకువ రాలేదేమిటీ వేళ ?" మంచం దిగబోయింది హైమవతి. ఎంతో నీరసంగా అనిపించింది. 'ఈ రోజు.... అవును.... అవును.... ఈరోజే....' ఐదురోజులు ఘనంగా జరిగిన తమ పెళ్ళిరోజుని గుర్తు తెచ్చుకుంటూ, నీరసాన్ని ఒక పక్కకి నెట్టి ఉత్సాహంగా మంచం దిగింది.

"ఎలావుంది ఒంట్లో ఇప్పుడు ? రాత్రి మమ్మల్ని చాలా కంగారు పెట్టేశావు సుమా ! నేను వచ్చిన ఐదు నిమిషాలకి అబ్బాయిలు కూడా వచ్చా రింటికి. డాక్టర్ని పిలిపించాను. ఇంజెక్ష నిచ్చాడు. మాత్రలు కూడా ఇచ్చాడు" టవల్‌తో మొహం తుడుచుకుంటూ గదిలోకి వచ్చారు శ్రీనివాసరావుగారు.

సెలవు రోజుల్లో ఎనిమిదవందే నిద్రలేవని భర్త ఆరోజు అప్పుడే

అంత తొందరగా లేవడం వింతగానే అనిపించింది హైమవతికి. అంతలో రాత్రి తను పడ్డ బాధ, గోపీచేత క్లబ్బుకి కబురుపంపడం అన్నీ గుర్తొచ్చాయి. "గోపీచేత కబురు పంపితే రాలేదేం మీరు?" అంది. గోపీ కబురు అందించలేదేమో నని అనుమానపడుతూ.

"అప్పటికే నెప్పి మొదలయిందా నీకు? క్లబ్బు బాయ్ చెప్పాడు ఇంటికిరమ్మని కబురొచ్చిందని. ఆట మంచి పట్టులోవుంది. వదిలి రాబుద్ధికాలేదు. పైగా అంత కొంపలు మునిగిపోయే అవసరం ఏముం టుంది చనక ఇంటిదగ్గర? చేతి కందివచ్చిన పిల్లలున్నారు కూడా, కొంపేం మునిగిపోదులే అని నిదానంగా వచ్చాను." ఆయన మాటల్లోని నిర్లక్ష్యం హైమవతి గుండెల్ని కోసింది. రాత్రి పడిన బాధకంటే ఈ బాధ వందరెట్లు ఎక్కువ అనిపించింది. తనకంటే, తన మాటకంటే ఆ పేకాటే ఎక్కువన్నమాట. అదే ముఖ్యం అన్న మాట. మనసులో ముల్లు దిగింది. అభిమానం దెబ్బతింది. అన్నిటినీ భరిస్తూ మౌనంగా గదిలోంచి బయటికి నడిచింది. 'రాత్రి రావు(లు జీడిపప్పు తీసుకు రాలేదు. డబ్బు తిరిగి యివ్వలేదు. ఈసా రెప్పుడైనా ఎక్కడైనా కనపడకపోతాడా? తను అడగకపోతుందా?' పెరట్లోకి వెళ్ళింది. నూతి దగ్గర నీళ్ళు తోడుతున్న రంగన్నని పంపి తెమ్మంటే సరి. ఎక్కడో అక్కడ జీడిపప్పు తీసుకు రాలేకపోడు. తనకి తనే చెప్పుకుని తృప్తి పడింది. పనుల్లో జొరబడింది.

కాఫీతాగి, స్నానంచేసి డ్రెస్ అవుతున్న భర్తదగ్గరికి మెల్లగా నడిచింది. ఈవేళ మన పెళ్ళయిన రోజని ఆయనే ముందు అంటారేమో చూద్దామని ఆశగా నిలబడింది. 'ఊహూఁ! ఈ లోకంలోనే ఉన్నట్టు లేరు. ఏం మనిషో?' అప్రయత్నంగా నిట్టూర్చింది. నిజంగానే రావు గారు తన ఊహల్లో తను ఉన్నారు. భార్య వచ్చిందికూడా గమనించ లేదు. అవును మరి....ఈవేళ క్లబ్బు మెంబర్సు కొందరు కలిసి పిక్నిక్కి వెళ్ళుతున్నారు. అందులో తనుకూడా ఉన్నారు. రాత్రికి కానీ తిరిగి ఇంటికిరారు. అసలా ప్రోగ్రామ్ వేసిందీ, నలుగురిచేతా 'ఓ కే' అని

పించింది శ్యామలే. ప్రత్యేక ఆకర్షణగా శ్యామల ఉంది కాబట్టి అరు నూరైనా పిక్నిక్ మిస్ అవకూడదని నిశ్చయించుకున్నారు రావుగారు.

"ఎక్కడికో బయలుదేరినట్లున్నారు—ఇప్పుడు వెళ్ళకపోతే నేం?" భయం భయంగా మనసులో ఉన్నమాట అంది. కొత్తగా మాట్లాడుతున్నావేమి టన్నట్టు నిర్లక్ష్యంగా ఓ చూపు విసిరారు రావుగారు.

"టిఫిను తిన లేదు. టేబిల్ మీద అలాగేవుంది. తీసుకొస్తాను." వెనక్కి తిరిగింది. "వద్దు. టైము లేదు. బయటెక్కడో తీసుకుంటాలే."

"ఈ వేళ....ఈవేళ మన పెళ్ళియినరోజు." అర్థం చేసుకుంటారేమో నన్న ఆశతో తల దించుకుని చిన్నగా అంది.

"ఓ! దాని కింత ఉపోద్ఘాతం ఎందుకు? డబ్బేమైనా కావలిస్తే ముందే అడగచ్చుగా?" అంటూనే ఆమాట లన్నంత త్వరగానూ జేబులో ఉన్న అయిదారు పచ్చనోట్లు బయటికి తీసి, అందులోంచి ఒక నోటు తీసి భార్యచేతిలో పెట్టారు. "కొత్తచీర కావాలంటే కొనుక్కో. పనిమనిషినో, రంగన్ననో సాయం తీసుకెళ్ళు. మరి నే వెళతాను. టైములేదు. రాత్రి బాగా పొద్దుపోతుంది నే వచ్చేసరికి. నాకోసం కూర్చోక అన్నం తినేసి, నిద్రపో."

పెద్దపెద్ద అంగలు వేసుకుంటూ హడావిడిగా వెళ్ళిపోతున్న భర్త వంక నిస్పృహాయంగా చూసింది హైమవతి.

మనసుకీ, మనిషికీ మధ్య కన్నీటి వంతెన కట్టింది పచ్చనోటు.

★